**విలేకరులు కావలెను**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో విలేకరులుగా పనిచేయడానికి ఆహ్వానిస్తున్నాము. సామాజిక దృక్పదం, అవినీతి, అక్రమాలపై అక్షర గళాన్ని వినిపించే దమ్మున్న విలేకరులు 'అక్షర వెలుగు' తెలుగు దిన పత్రికలో పని చేయడానికి ఈ క్రింది మేయిల్ అడ్రస్‌కు వివరాలను పంపండి

Mail: aksharavelugudaily@gmail.com

8985893382



www.aksharavelugu.com

# అక్షర వెలుగు

జనం కోసం - మన అక్షరం

తెలుగు దిన పత్రిక

మంగళ వారం

3.5.2022

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్

సంపుటి - 01, సంచిక-68

పేజీలు - 4 వెల రూ. 5

ఎడిటర్ :
గోసుకొండ పృధ్విరాజు

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak


## ప్రత్యక్ష రాజకీయాల్లోకి పీకే

### బీహార్ నుంచి అరంగేట్రానికి వ్యూహం




**న్యూఢిల్లీ, మే 2 (అక్షర వెలుగు):** రాజకీయ ప్రముఖ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. కొత్త పార్టీ లాంఛ్ చేస్తున్నట్లు ప్రకటించారు. తన రాజకీయ ప్రయాణం బిహార్ నుంచే ఉంటుందని తెలిపారు. అయితే కాంగ్రెస్ లో చేరుతారని తొలుత భావించినా.. భిన్నాభిప్రాయాలు రావడంతో ఆయన నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు. చాలా కాలంగా తాను అర్థవంతమైన ప్రజాస్వామ్యంలో భాగస్వామిగా ఉన్నానన్నారు ప్రశాంత్ కిషోర్. ప్రజలకు అవసరమైన పాలసీల తయారీ కోసం పదేళ్లుగా పనిచేస్తున్నానని ట్వీట్ చేశారు. ఇప్పుడు రియల్ మాస్టర్ గా మారే సమయం వచ్చిందన్నారు. అంశాలను మరింతగా అర్థం చేసుకునేందుకు జన్ సురాజ్ పేరుతో కొత్త పార్టీతో వస్తున్నానని చెప్పారు. బిహార్ నుంచి తన ప్రయాణం ప్రారంభిస్తున్నానని చెప్పారు. ప్రశాంత్ కిషోర్ బీహార్ జనతాదళ్ ఉపాధ్యక్షుడిగా ఉన్నప్పుడు యువతను ఆకర్షించడమే లక్ష్యంగా పార్టీ నిర్దేశిరచిన లక్ష్యాలను అందుకున్నారు.అందులో కొంతమేర విజయం సాధించినట్లుగా భావించారు.ఇప్పటికే పీకే ప్రత్యక్షంగా..పరోక్షంగా వివిధ పార్టీలకు వ్యూహకర్తగా పనిచేస్తున్నారు. తెలంగాణలో టీఆర్ఎస్‌కు ప్రస్తుతం ఎన్నికల వ్యూహకర్తగా పనిచేస్తున్నారు.

## పేలిన చెంప

### ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ పై దాడి

కేసీఆర్, కేటీఆర్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకే చెయ్యి చేసుకున్న: అనీల్




**హైదరాబాద్, మే 2 (అక్షర వెలుగు):** గత కొన్ని రోజులుగా కేఏపాల్ తెలంగాణ ప్రాంతంలో పర్యటనలు చేస్తున్నారు. ఈ క్రమంలో సిద్ధిపేట దారిగా వెళ్ళుతుండగా పోలీసులు అడ్డగించారు. ఈ క్రమంలో రైతులు అక్కడకు చేరుకుని కేఏ పాల్‌ను నిలదీశారు. కేసీఆర్, కేటీఆర్‌లను ఎలా తిడుతావు అని శాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ పై అనీల్ అనే రైతు చెయ్యిచేసుకున్నాడు. ఈ ఘటనకు సంబంధించి సోషల్‌మీడియాలో వీడియో వైరల్ అయ్యింది.

## ఉస్మానియా గడ్డపై రగులుకున్న రాజకీయం

- పోటాపోటీగా విద్యార్థుల ప్రదర్శనలు
- భారీగా మొహరించిన పోలీసులు
- రాహుల్ సభకు అనుమతి నిరాకరణపై మండిపాటు
- విసి రాజకీయ ఒత్తిడికి తలొగ్గారన్న రేవంత్
- గాంధీభవన్ ముందు కెసిఆర్ దిష్టిబొమ్మ దగ్ధం



**హైదరాబాద్, మే 2 (అక్షర వెలుగు):** రాష్ట్రంలో రాహుల్ టూర్ నేపధ్యంలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతు న్నాయి. ముందస్తు అరెస్టులకు నిరసనగా సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ఎస్‌యు ఆందోళనకు పిలుపునిచ్చింది. ఓయూలో రాహుల్ ముఖాముఖికి అనుమతి ఇవ్వాలంటూ నిరసనలు తెలుపుతున్నారు. దీంతో ఓయూలో ఎన్ఎస్‌యుఐ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని ఓయుపోలీస్ స్టేషన్ కు తరలించారు. మరోవైపు ఓయూలో భారీగా పోలీసులు మోహరించారు. ఇదిలావుంటే రాహుల్ పర్యటనకు ఓయూ అనుమతినిరాకరించింది. రాజకీయకార్యకలాపాలకు అనుమతి లేదంటూ ఓయూ విసి స్పష్టం చేశారు. పాలకమండలి ఈ మేరకు నిర్ణయం తీసుకుందని అన్నారు. అలాగే ఓయూలో ఆందోళనలకు అనుమతి లేదన్నారు. అటు ఓయులో అరెస్ట్‌లపై విద్యార్థి నేతలు మండిపడుతున్నారు. అరెస్టులపై హైకోర్టును ఆశ్రయిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలతో గాంధీ భవన్ దగ్గర భారీగా పోలీసులు మోహరించారు. సిఎం కెసిఆర్ దిష్టిబొమ్మను మహిళా కాంగ్రెస్ నేతలు దగ్ధం చేశారు. కెసిఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలుచేశారు. మొత్తంగా ఇప్పుడు రాహుల్ పర్యటన నేపథ్యంలో తెలంగాణలో ఉద్యమాల పురిటిగడ్డ ఉస్మానియా కేంద్రంగా రాజకీయం వేడెక్కుతోంది. యూనివర్సిటీలోకి రాహుల్ గాంధీని తీసుకువెళ్లాలని కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయం హాట్‌హాట్‌గా మారుతోంది. అక్కడ అడుగు పెట్టకుండానే తెరాస, కాంగ్రెస్ నేతల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. ఉస్మానియాలో రాహుల్ సభకు అనుమతి ఇవ్వకపోవడం వెనుక అధికార పార్టీ హస్తం ఉందని కాంగ్రెస్

2

## ప్రధాని మోడీ మూడ్రోజుల ఐరోపా పర్యటన

### జర్మనీ చేరుకున్న మోడీకి ఘనంగా స్వాగతం




**న్యూఢిల్లీ, మే 2 (అక్షర వెలుగు):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఐరోపా పర్యటన ప్రారంభమైంది. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో బయల్దేరిన మోదీ.. జర్మనీలో ల్యాండ్ అయ్యారు. ఆ దేశ ఛాన్సలర్ షోల్జ్‌తో మోదీ భేటీ కానున్నారు. అనంతరం వివిధ సమావేశాల్లో పాల్గొననున్నారు. మూడు రోజుల ఐరోపా పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ... జర్మనీకి చేరుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి తర్వాత దిల్లీ నుంచి బయల్దేరి వెళ్లిన ఆయన.. సోమవారం ఉదయం జర్మనీలో దిగారు. ఆ దేశ ఉన్నతాధికారులు మోదీకి సాదరస్వాగతం పలికారు. భారత్-జర్మనీ అంతర్ ప్రభుత్వ సంప్రదింపుల ఆరో సమావేశానికి ఇరువురు దేశాధినేతలు అధ్యక్షత వహించనున్నారు. ఈ సమావేశానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ హాజరవుతారు. ఈ కార్యక్రమం అనంతరం ఉన్నతస్థాయి రౌండ్ టేబుల్ సమావేశంలో మోదీ, షోల్జ్ పాల్గొంటారు. రెండు దేశాలకు చెందిన ప్రముఖ కంపెనీల సీఈఓలతో ముచ్చటించనున్నారు. రాత్రి 10 గంటలకు భారత సమాజాన్ని ఉద్దేశించి ప్రధాని మోదీ

## అరెస్టులు, నిర్బంధాలతో నియంత్రించలేరు

- రాహుల్ ఓయూలో పర్యటించి తీరుతారు
- అదేరోజు చంచల్‌గూడ జైలులో విద్యార్థులను పరామర్శిస్తారు
- ములాఖత్‌కు జైలర్‌ను కలసి వినతి పత్రం ఇచ్చిన రేవంత్ తదితరులు




**హైదరాబాద్, మే 2 (అక్షర వెలుగు):** అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో ఉద్యమాలను ప్రభుత్వం నియంత్రించ లేదని పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాహుల్ పర్యటన కోసం ప్రజాస్వామ్యయుతంగా అనుమతి కోసం ప్రయత్నించిన ఎన్ఎస్‌యూఐ నేతలను అరెస్టు చేయడంపై రేవంత్ మండిపడ్డారు. ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా రాహుల్ గాంధీ ఉస్మానియా విశ్వవిద్యాలయంతో పాటు చంచల్‌గూడ కారాగారాన్ని సందర్శిస్తారని తేల్చిచెప్పారు. ఈనెల 7న అరెస్టు అయిన ఎన్ఎస్‌యూఐ నేతలను కలుస్తారని ప్రకటించారు. ములాఖత్‌కు సమయం ఇవ్వాలని జైలు సూపరింటెండెంట్ శివకుమార్‌ను కాంగ్రెస్ నేతలతో కలిసి వినతిపత్రం అందించారు. ఓయూకి కేంద్రం నుంచి నిధులు రాబట్టేందుకు రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో నిలదీస్తారని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. ఓయూలో యూజీసీ నిధులు సరిగా వినియోగం అవుతున్నాయా.. ఓయూలో నియామకాలు సరిగా జరుగుతున్నాయా లేదా అని రాహుల్ తెలుసుకుంటారన్నారు. తెలంగాణ రైతులకు అండగా ఉండాలని రాహుల్ గాంధీ నిర్ణయించుకున్నారని రేవంత్ స్పష్టం చేశారు. తెలంగాణ పర్యటనకు రావాలని నిర్ణయం తీసుకున్నారన్నారు. ఓయూ విద్యార్థి నాయకులను రాహుల్

2

## కోవిడ్ టీకా కోసం ఒత్తిడి చేయొద్దు

### దుష్పరిణామాలపై డేటా విడుదలకు ఆదేశం




**న్యూఢిల్లీ, మే 2 (అక్షర వెలుగు):** కోవిడ్ టీకా వేసుకోవాలని ప్రజల్ని వత్తిడి చేయవద్దు అని సుప్రీంకోర్టు పేర్కొన్నది. ప్రస్తుతం జరుగుతున్న వ్యాక్సినేషన్ విధానం అసంబద్ధంగా ఉందని అనలేమని సుప్రీం తెలిపింది. కోవిడ్19 వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల కలిగే దుష్పరిణామాల గురించి కేంద్రం డేటాను రిలీజ్ చేయాలని సుప్రీంకోర్టు పేర్కొన్నది. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు విధించిన ఆంక్షలను కోర్టు తప్పుపట్టింది. వ్యాక్సిన్ వేసుకోని వారిని పబ్లిక్ ప్రదేశాలకు రానివ్వకపోవడం సరిగా లేదని కోర్టు తెలిపింది. అలాంటి నిర్ణయాలు తీసుకున్న ప్రభుత్వాలు వెంటనే వాటిని ఎత్తివేయాలని ఇవాళ సుప్రీంకోర్టు కోరింది. వ్యాక్సినేషన్ విషయంలో ప్రభుత్వం ఓ విధానాన్ని రూపొందించి, ప్రజా సంక్షేమం కోసం కొన్ని షరతులను అమలు చేయాలని కోర్టు తన తీర్పులో చెప్పింది.

## కెటిఆర్‌కు కిషన్ రెడ్డి కౌంటర్

### దళిత సిఎం మొదలు ఏదీ లేదంటూ విమర్శలు



**న్యూఢిల్లీ, మే 2 (అక్షర వెలుగు):** కెటిఆర్ విమర్శలకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ధీటుగా జవాబిచ్చారు. కెటిఆర్ మోడీపై చేసిన వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. ఈ మేరకు టీఆర్ఎస్‌పై ట్విట్టర్ వేదికగా సెటైర్లు వేశారు. టీఆర్ఎస్ పాలనలో 'ఇంటికో ఉద్యోగం లేదు., నిరుద్యోగ భృతి లేదు., ఉచిత ఎరువులు లేవు., ఋణమాఫీ లేదు., దళిత ముఖ్యమంత్రి లేరు., దళితులకు మూడెకరాల భూమి లేదు., పంటనష్ట పరిహారం లేదు, దళితబంధు లేదు, బీసీబంధు అసలే లేదు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఊసు లేదు, డబుల్ బెడ్ రూమ్ జాడ లేదు, అప్పులకు కొదవ లేదు, కొత్త రేషన్ కార్డుల ఊసు లేదు, కొత్త పెన్షన్ కార్డుల జాడ లేదు., సామాజిక న్యాయం లేదు., సచివాలయం లేదు., సీఎం ప్రజలను కలిసేది లేదు., ఉద్యమ కారులకు గౌరవం లేదు., విమోచన దినోత్సవం జరిపేది లేదు.' ఇలా చెప్పుకుంటూపోతే సీఎం కేసీఆర్ మోసపూరిత హామీలకు కొదవ లేదంటూ కిషన్ రెడ్డి విమర్శలు గుప్పించారు.

## 6నుంచి ఇంటర్ పరీక్షలు


### వెబ్‌సైట్‌లో హాల్‌టిక్కట్లు



**హైదరాబాద్, మే 2 (అక్షర వెలుగు):** ఈనెల 6వ తేదీ నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయని, విద్యార్థులు వెబ్‌సైట్‌లో హాల్ టికెట్స్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని, వీటిపై ఎలాంటి సంతకాలు.. స్టాంప్ అవసరం లేదని ఇంటర్ బోర్డ్ కార్యదర్శి సయ్యద్ ఉమర్ జలీల్ పేర్కొన్నారు. సోమవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ 70 శాతం సిలబస్‌తో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. క్వశ్చన్ పేపర్‌లోనూ.. సమాధానాలు రాయాల్సిన ప్రశ్నలకు ఛాయిస్ పెంచామన్నారు. ఇప్పటికే బేసిక్ లెర్నింగ్ మెటీరియల్ ప్రతీ కాలేజ్‌కు పంపించామని చెప్పారు. ఇంటర్మీడియట్ యూట్యూబ్ ఛానెల్‌లోను ఆడియో, వీడియో క్లాసెస్ ఉన్నాయన్నారు. అన్ని రకాల కరోనా జాగ్రత్తలతో పరీక్షలు నిర్వహిస్తున్నామని, పరీక్ష రాసేటప్పుడు ప్రతి ఒక్కరు మాస్క్ ధరించాల్సిందేనని అదనపు బస్సులను ఏర్పాటు చేసినట్లు సయ్యద్ ఉమర్ జలీల్ తెలిపారు.

## పాతబస్తీలో రంజాన్ సందడి

- జోరుగా షాపింగ్ చేసిన ప్రజలు
- రాత్రిపూట వెలుగులో షాపంగ్ మజా



హైదరాబాద్,మే2(ఆర్ఎన్ఎ): ముస్లిం సోదరులు రంజాన్ పర్వదినంసందర్భంగా హైదరాబాద్ మార్కెట్లు కళకళలాడాయి. గతరెండేళ్లుగా కరోనాతో పండగకు పెద్దగా ప్రాధాన్యం దక్కలేదు. హైదరాబాద్ మార్కెట్లు కళకలలాడాయి. ఆదివారం అర్ధరాత్రి వకూ దీపాల వెలుగులో పాతబస్తీ పులకించింది. పండుగ షాపింగ్ చేసుకోవడానికి ముస్లింలు ప్రాధాన్యం ఇస్తారు. లభించింది. అర్ధరాత్రి దాటాక నగరంలో మార్కెట్లు జనంరద్దీతో కిటకిటలాడాయి.



పండుగకు ఒక్క రోజు మాత్రమే మిగిలి ఉండడంతో చార్మినార్ పరిసరాలలో బట్టలు, చెప్పులు ఇతర వస్తువులు చౌకగా లభిస్తుండడంతో ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారు. దీంతో పాతబస్తీలోని మార్కెట్లన్నీ కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. రంజాన్ కొనుగోళ్లు చివరి దశకు చేరుకోవడంతో క్రయవిక్రయాలు జోరందుకున్నాయి. వ్యాపారులు కొనుగోలుదారులను ఆకర్శించేలా ఏర్పాట్లు చేసుకున్నారు. రంజాన్ పండుగ సందడితో ముస్లిం సోదరుల కొనుగోళ్ళతో చార్మినార్ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. పాతబస్తీలోని ప్రతి బస్తీ, ప్రతి

2

## ఎలక్ట్రానిక్ పరికరాల ఉత్పత్తి రంగంలో భారీగా పెట్టుబడులు

- పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- రేడియంట్ ఎలక్ట్రానిక్స్ యూనిట్‌లో మరో నూతన ప్లాంట్
- లాంఛనంగా ప్రారంభించిన మంత్రులు కెటిఆర్, సబిత



రంగారెడ్డి,మే2(ఆర్ఎన్ఎ): ఎలక్ట్రానిక్ పరికరాల ఉత్పత్తి రంగంలో రాబోయే పదేండ్లలో రెండున్నర లక్షల కోట్ల ఆదాయం, 16 లక్షల ఉద్యోగాలు సృష్టించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. ఇప్పటికే తెలంగాణ అన్ని రంగాల్లో దూసుకెళ్తుందని, స్థిరమైన ప్రభుత్వం, సమర్థవంతమైన నాయకుడు ఉన్నందునే ఇది సాధ్యమవుతుందని ఉద్ఘాటించారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని రావిర్యాల ఈ-సిటీలో రేడియంట్ ఎలక్ట్రానిక్స్ యూనిట్‌లో మరో నూతన ప్లాంట్‌ను మంత్రులు కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డి కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో రేడియంట్ కంపెనీ నుంచి 50 లక్షల టీవీలు తయారవ్వడం గర్వంగా ఉందన్నారు. దేశంలోనే అతిపెద్ద ఎల్ఈడీ టీవీ కంపెనీ ఇది అని పేర్కొన్నారు. రేడియంట్ కంపెనీలో 3,800ల మందికి పైగా పని చేస్తున్నారని తెలిపారు. యూనిట్ ప్రారంభంలో సంవత్సరానికి 4 లక్షల టీవీలు తయారు చేద్దామని అనుకున్నప్పటికీ.. నెలకు 4 లక్షల టీవీలు తయారు చేసే స్థాయికి ఎదగడం సంతోషంగా ఉందన్నారు. ఇది తెలంగాణకు గర్వకారణం అన్నారు. ఉద్యోగుల్లో 53 శాతం మహిళలు ఉండగా, 60 శాతం తెలంగాణ వారే ఉన్నారని కేటీఆర్ స్పష్టం చేశారు. రేడియంట్ కంపెనీ ప్రపంచ ప్రఖ్యాతి కలిగిన శ్యాంసంగ్, వన్ ప్లస్, పానసోనిక్, అమెజాన్ స్కైవర్త్, నోకియా, మోటోరోలా లాంటి వాటిని తయారు చేస్తుందని కేటీఆర్ తెలిపారు. మా కంపెనీ ఆదాయం 35 రెట్లు పెరిగిందని కంపెనీ యాజమాన్యం తెలిపిందన్నారు. ఈ ఆదాయం పెరగడానికి కారణం.. తెలంగాణలో ఉన్న సానుకూల వాతావరణం వల్లే తమ వ్యాపారం వేగంగా అభివృద్ధి చెందిందని వారు తెలిపినట్లు కేటీఆర్ పేర్కొన్నారు. గత కొన్నేండ్ల నుంచి కరెంట్ కోతలు లేవు. కరెంట్ కోతలుంటే పరిశ్రమలు సరిగా నడవవు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో కరెంట్ కోతలను అధిగమించాం. పరిశ్రమలకే కాకుండా అన్ని రంగాలకు 24

2

## అల్లాదుర్గంను ప్రత్యేక రెవెన్యూ మున్సిపాలిటీ చేయాలి

### గ్రామ పంచాయతీ కార్యదర్శికి

### టిఆర్ఎస్ పార్టీ సీనియర్ లీడర్ విస్లావత్ గోపాల్ వినతి పత్రం అందజేత



**అందోల్ మే 2 (అక్షర వెలుగు):** మెదక్ జిల్లా అందోల్ నియోజకవర్గం లోని మండలమైన అల్లాదుర్గం పరిధిలోని నూతన ప్రత్యేక గొల్ల కుంట తాండ గ్రామపంచాయతీ కార్యదర్శి రాకేష్‌కి ఉమ్మడి మెదక్ జిల్లా గిరిజన సంక్షేమ సంఘం జిల్లా నాయకులు, టిఆర్ఎస్ పార్టీ సీనియర్ లీడర్ విస్లావత్ గోపాల్ వినతి పత్రం ఇవ్వడం జరిగింది. 1. అల్లాదుర్గం మేజర్ గ్రామ పంచాయతీ, 2 నూతన ప్రత్యేక గొల్ల కుంట తాండ గ్రామపంచాయతీ, 3. నూతన ప్రత్యేక నడిమి తాండ గ్రామపంచాయతీ, 4. రెడ్డి పల్లి గ్రామపంచాయతీ, 5. వెంకట్రావు పేట గ్రామపంచాయతీ, 6. చేవెల్ల గ్రామపంచాయతీ, 7. కాయితం పల్లి గ్రామపంచాయతీ ఈ ఏడు గ్రామ పంచాయతీలను కలుపుకొని నూతన అల్లాదుర్గంను ప్రత్యేక మున్సిపాలిటీ తో పాటు రెవెన్యూ మున్సిపాలిటీగా చేయాలని కార్యదర్శికి మర్యాదపూర్వకంగా కలసి వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు. గొల్ల కుంట తాండ గ్రామపంచాయతీ నుండి మున్సిపాలిటీ ఏర్పాటు చేయడం కొరకు గ్రామ పంచాయతీ తీర్మానం ఇవ్వాలని వినతి పత్రంలో పేర్కొనడం జరిగింది. ప్రస్తుతం అల్లాదుర్గం మండలంతో పాటు సబ్ డివిజన్‌గా మరియు సి ఐ సర్కిల్ కార్యాలయం కూడా కొనసాగుతుందని తెలిపారు. 1. అల్లాదుర్గం మండలం, 2. రేగోడ్ మండలం, 3. పెద్దశంకరంపేట మండలం, 4. టేక్మాల్ మండలం ఈ నాలుగు మండలాలకు అల్లాదుర్గం సబ్‌డివిజన్‌గా కొనసాగుతుంది. ఐసిడిఎస్ కార్యాలయం, నీటి పారుదల శాఖ కార్యాలయం, తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ కార్యాలయం, ఇదే నాలుగు మండలాలకు సిఐ సర్కిల్ కార్యాలయం కూడా ఉంది. హైదరాబాద్ నుండి గతంలో అల్లాదుర్గం రావడానికి సుమారు మూడు గంటల సమయం పడేది ప్రస్తుతం హైదరాబాద్ నుండి అల్లాదుర్గం రావడం కేవలం కారులో ఒక గంట సమయం పడుతుంది. సంగారెడ్డి నుండి నాందేడ్ వరకు నేషనల్ హైవే ఫోర్ లైన్ 161 రోడ్డు విస్తీరణం కావడంతో ప్రయాణికులకు సమయం తక్కువ పడుతుంది.

## రంజాన్ కిట్ పంపిణీ



**అందోల్, మే 2 (అక్షర వెలుగు):** అందోల్ నియోజకవర్గం నేరేడుగుంట గ్రామంలో ముస్లిం ల పండగ సందర్భంగా ప్రభుత్వం ఇస్తున్న కిట్స్ ను ఎంపిటిసి లవ కృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో నేడు గ్రామ పంచాయతీ ఆవరణలో పంపిణీ చేయడం జరిగింది .ఈ ప్రభుత్వం అన్ని కులాలకు మతాలకు ఆదుకుంటూ ముందుకు పోతుందని ఎంపీటీసీ లవ్వ కృష్ణ గౌడ్ ప్రభుత్వ పథకాలు అందరికీ అదే విధంగా వారధిగా పని చేస్తూ ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణ వెంకటేశం శ్రీశైలం గొల్ల నారాయణ వీరయ్య తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.

## టిఆర్ఎస్ కార్యకర్త కొండి ప్రవీణ్ మృతి



**సంగారెడ్డి, అందోల్, మే 2 (అక్షర వెలుగు):** సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం సాయిబాన్ పేట్ గ్రామానికి చెందిన కొండి ప్రవీణ్(42)టిఆర్ఎస్ కార్యకర్త చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో కన్నుమూశారు. ఆదివారం మధ్యాహ్నం చౌటకూర్ మండలం శివ్వంపేట గ్రామ శివారు ప్రధాన రహదారి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం లో గాయపడ్డ బైకిస్ట్ కొండి ప్రవీణ్ తలకు తీవ్రమైన గాయం కావడంతో మెరుగుయిన చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ ఈ రోజు మృతి చెందినట్లు గా బంధువులు వెల్లడించారు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబీకులు,మిత్రులు ఆయన జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ కన్నీటి పర్యంతం అవుతున్నారు.

## పూర్తి సామర్థ్యంతో బస్సులో బయలుదేరాలి

### ఆర్టీసీ బస్సులోనే ప్రజలు ప్రయాణించాలి: సీనియర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్



**నారాయణఖేడ్, మే 2 (అక్షర వెలుగు):** ప్రయాణికుల క్షేమ విధేయంగా సేవలందించిన ఆర్టీసీ బస్సులోనే ప్రజలు ప్రయాణించాలని ఆర్టీసీ సీనియర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్ అన్నారు. సంస్థ ఎండి సజ్జనార్ ఆదేశాలు డిపో మేనేజర్ భక్షి నాయక్ పిలుపు మేరకు సోమవారం నారాయణఖేడ్ లోని రాజీవ్ చౌక్ లో ని బస్సుల పని వేళలు ప్రయాణికులు సామర్థ్యాన్ని పర్య వేక్షించారు. అనంతరం మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులు నడుపే డ్రైవర్లు పూర్తిస్థాయి నిష్ణాతులై ఉంటారు అని అన్నారు. సౌకర్యార్థం హైదరాబాదుకు అదనపు బస్సులు వేయడం జరిగింది అన్నారు. ప్రైవేట్ వాహనాలలో ప్రయాణం ప్రమాదకరం అన్నారు. బస్సుల్లో సీట్ల స్థాయి సామర్థ్యం నిండిన తర్వాత బస్సులు బయలు దేరాలని డ్రైవర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ సెల్ ఇన్చార్జి పాండు డిప్యూటీ సూపర్నెంట్ చందుపల్ల సంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## మేడే స్ఫూర్తితో ప్రజలు కేంద్ర బీజేపీపై పోరాటం నిర్వహించాలి

### సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.వెంకటయ్య



**దోమ, మే 2 (అక్షర వెలుగు):** మేడే ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు దోమ మండలం తిమ్మాయిపల్లి గ్రామంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం వెంకటయ్య సిపిఎం జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ...మేడే వారోత్సవాలు మే -1 నుండి 7వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల గ్రామాలలో మే డే నిర్వహించాలని పిలుపులో భాగంగా నేను కూడా రాష్ట్ర వ్యాప్తంగా జెండాను ఆవిష్కరించడం జరిగిందని అన్నారు. ప్రపంచంలో, దేశంలో మరెక్కడైనా ప్రజలకు, కార్మికులకు హక్కులు, సౌకర్యాలు, సంక్షేమం మరేదైనా మంచి గురించి వచ్చాయంటే ప్రజల కార్మికుల పోరాట ఫలితమే అని ఆయన అన్నారు. అంతే తప్ప అది పాలకుల, ప్రభుత్వాల దయాదాక్షిణ్యాలు కాదని గుర్తు చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోనికి వచ్చినప్పటి నుండి నియంతృత్వ పోకడలు పోతున్నది. నిత్యావసర ధరలు విపరీతంగా పెంచడం, ప్రజల సంక్షేమం మరిచిందని దయబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా రాష్ట్రంలోని ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని త్వరలో రాష్ట్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ప్రజలంతా మేడే స్ఫూర్తితో ఐక్యంగా పోరాటాలు చేసి కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించి, ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఎన్నుకునెంతవరకు ప్రజా సమస్యలు పరిష్కారం కావని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు సత్యయ్య, చిల్కమూరి సత్యయ్య, శేఖర్, కాషాయ్య, శ్రీను, శ్రీకాంత్, నరేష్, చెంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## పేదల అభ్యున్నతికి టీఆర్ఎస్ ప్రభుత్వం విశేష కృషి

### సర్పంచ్ కోళ్ళ సురేష్, ఎంపిటిసి రాములు



**దోమ, మే 2 (అక్షర వెలుగు):** పేదల అభ్యున్నతికి టిఆర్ఎస్ ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని సర్పంచ్ కోళ్ళ సురేష్ ఎంపిటిసి రాములు అన్నారు సోమవారం దోమ మండల పరిధిలోని బొంపల్లి గ్రామంలో ముస్లింలకు దుస్తులను పంపిణీ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ మైనారిటీల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యుడు ఖాజా పాష ఉప సర్పంచ్ రఫీక్ పాష, రైతుబంధు గ్రామ అధ్యక్షుడు షేర్ ఖాన్, మైనార్టీ సెల్ గ్రామ అధ్యక్షుడు తాహెర్ పాష, టిఆర్ఎస్ నాయకులు ఖలీల్, బాబర్, స్కూల్ చైర్మన్ అనంతయ్య, బుక్క పాష తదితరులు పాల్గొన్నారు

## స్క్రాప్ వాహనాలు వేలం

### రామగుండం సీపీ చంద్రశేఖర్ రెడ్డి



**పెద్దపల్లి, మే 2 (అక్షర వెలుగు):** రామగుండం కమిషనరేట్ గుర్తుతెలియని ప్రాపర్టీ కింద రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ పరిధిలలో 368 మోటార్ సైకిళ్ళు, 67 మూడు చక్రాల వాహనాలు, 11 నాలుగు చక్రాల వాహనాలు మొత్తం 446 వాహనాలపై అన్ని చట్టపరమైన విధానాలను అనుసరించి కేసు నమోదు చేయడం జరిగిందని, గతఆరు నెలల నుండి పై వాహనాల గురించి ఎవరు రానందున గుర్తుతెలియని స్క్రాప్ ప్రాపర్టీగా పరిగణించి వేలం వేయడం జరుగుతుందని ఈ నెల 7 వ తేదీనా వేలం వెయబడును అని రామగుండం పోలీస్ కమిషనర్ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని 446 స్క్రాప్ వివిధ రకాల వాహనాలను, పోలీస్ కమిషనర్ నియమించిన బహిరంగ వేలానికి సంబంధించిన కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన బెల్లంపల్లి డి ఏ ఆర్ హెడ్ క్వార్టర్ లో బహిరంగ వేలం పాట వేయనున్న ట్లు ఆసక్తిగలవారు వేలం పాటలో పాల్గొని వేలంపాట ద్వారా వాహనాలు స్వాధీనం చేసుకున్న వారు సంబంధిత వేలంపాట డబ్బులు చెల్లించి సంబంధిత వాహనాల ను తీసుకుని వెళ్లాలని సీపీ చంద్రశేఖర్ రెడ్డి ప్రకటనలో తెలి పారు. బహిరంగ వేలంలో పాల్గొనాలను కునేవారు, వారికి సంబంధించిన ఆధార్ కార్డు, ఏదైనా గుర్తింపు కార్డులు కేంద్రం, రాష్ట్ర ప్రభు త్వాల ద్వారా ఆమోదం పొందినది మరియు ఇతర వివరాలు గల పత్రాలు వారి వెంట తీసుకొని రాగలరు ఇతర వివరాల గురించి రిజర్వ్ ఇన్స్పెక్టర్ మధుకర్- 79011 2602 అంజన్న- 9494026036 ఈ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

## (ఈద్-ఉల్-ఫితర్) సందర్భంగా జిల్లాలోని ముస్లిం ప్రజలందరికీ రంజాన్ పండగ శుభాకాంక్షలు



**మెదక్, మే 2 (అక్షర వెలుగు):** మెదక్ యెస్.పి రోహిణి ప్రియదర్శిని ఐ.పి.యెస్ మాట్లాడుతూ రంజాన్ పండుగ (ఈద్-ఉల్-ఫితర్) సందర్భంగా జిల్లాలోని ముస్లిం ప్రజలందరికీ రంజాన్ పండగ శుభాకాంక్షలు తెలిపారు. మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా యెస్.పి రోహిణి ప్రియదర్శిని ఐ.పి.యెస్ మాట్లాడుతూ..రంజాన్ పండుగ (ఈద్-ఉల్-ఫితర్) సందర్భంగా జిల్లాలోని ముస్లిం ప్రజలందరికీ రంజాన్ పండగ శు భాకాంక్షలు తెలిపారు. పవిత్ర మాసమైన రంజాన్ లో నెల రోజులపాటు అత్యంత భక్తి శ్రద్ధలతో నిష్ఠగా ఉపవాస దీక్షతో ఉండి నిర్మలమైన మనసుతో అల్లాను ప్రార్థించిన ప్రతి ఒక్కరికి కరుణాకటాక్షాలు సదా ఉండాలని కోరారు. జిల్లాలోని ముస్లిం ప్రజలందరూ కుటుంబసభ్యులు, బంధు మిత్రులతో ఆనందోత్సాహాల మధ్య సంతోషంగా రంజాన్ పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## వివాహ వేడుకలకు డా॥ పట్లోల సంజీవరెడ్డి (పిసిసి సభ్యులు)



**నారాయణఖేడ్, మే 2 (అక్షర వెలుగు):** నారాయణఖేడ్ నియోజకవర్గం పెద్ద శంకరంపేట్(అ) మండలంలోని బుర్గు పల్లి గ్రామానికి చెందిన మండలు యస్,సి.సెల్ అధ్యక్షులు విజయ్ కుమారుడి వివాహానికి హాజరైన డా॥పట్లోల సంజీవరెడ్డి (పిసిసి సభ్యులు) ఈ సందర్భంగా నూతన వధువరులకు ఆశీర్వదించి, వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే ఈ వివాహ వేడుకలకు హాజరైన వారిలో బ్లాక్ కాంగ్రెసు అధ్యక్షులు బొజి రెడ్డి, బుర్గు పల్లి మాజీ సర్పంచ్ నారా గౌడ్, కారం ముంగి మాజీ సర్పంచ్ సంగమేశ్ శేట్, మూసా పెట్ సర్పంచ్ అంజి రెడ్డి, బుర్గు పల్లి ఎంపిటిసి రాజ్ కుమార్, సాయి రెడ్డి, సంగయ్య, కారం ముంగి సర్పంచ్ గుండు పాటిల్, మనూర్ పి.ఎ.సి.యస్ చైర్మన్ శ్రీకాంత్ మరియు బంధుమిత్రులు తదితరులు హాజరయ్యారు.

## ఆయన సేవలు మరువలేనివి

### మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహ




**సంగారెడ్డి, అందోల్, మే 2 (అక్షర వెలుగు):** సంగారెడ్డి జిల్లా ఆందోల్ నియోజకవర్గం అందోల్ మండలం దాదులూరు గ్రామంలో పెద్దలు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కీర్తిశేషులు కృష్ణారెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆదివారం మాజీ ముఖ్యమంత్రి వర్యులు ప్రస్తుత టీపీసీసీ చీఫ్ ఎలక్షన్ కమిటీ చైర్మన్ దామోదర రాజనర్సింహ దంపతులు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మన మధ్యలో నేను ఆయన పార్టీకి చేసిన సేవలు మరువలేనివని దామోదర రాజనర్సింహ కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు అందరూ కూడా పార్టీలకతీతంగా కృష్ణారెడ్డి ప్రథమ వర్ధంతికి వచ్చి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఫస్ట్ కౌన్సిలర్ శంకర్ చిట్టి బాబు సురేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పరిగి నియోజకవర్గ ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు

### ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి



**పరిగి మే 2 (అక్షర వెలుగు):** ఆధ్యాత్మిక వాతావరణం లో 30 రోజుల పాటు ఉపవాసం ఉండి, సమాజంలో ఉన్న పేద వారి ఆకలి బాధలు తెలుసుకొని, పెద్ద ఎత్తున దాన ధర్మాలు చేయటం గొప్ప విషయం అన్నారు. ఈ మాసంలో నిర్వహించే ఇఫ్తార్ పార్టీ లు మత సామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తాయని ఎమ్మెల్యే అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో పేద ముస్లింలకు రంజాన్ తోఫా అందిస్తూ అన్ని మతాలకు సమాన ప్రోత్సహం అందిస్తుందని తెలిపారు. శాంతి, సౌభాతృత్వం, ప్రేమ, త్యాగం, సేవకు, సామరస్యానికి రంజాన్ పండుగ నిదర్శనంగా నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అందరూ మంగళవారంనాడు రంజాన్ పండుగను ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకోవాలని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి ఆకాంక్షించారు.

## ప్రజావాణి కార్యక్రమాన్నికి విశేష స్పందన

### ఎస్.పి రోహిణి ప్రియదర్శిని ఐ.పి.ఎస్



**మెదక్, మే 2 (అక్షర వెలుగు):** ఎస్.పి రోహిణి ప్రియదర్శిని ఐ.పి.ఎస్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహి ంచడం జరిగింది. ఫిర్యాదుదా రుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించా ల్సిందిగా సంబందిత అధికారు లకు పలు సూచనలు చేయడం అయినది. మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాల యంలో జిల్లా ఎస్.పి రోహిణి ప్రియదర్శిని ఐ.పి. ఎస్ ప్రజావాణి కార్యక్ర మాన్ని నిర్వహించడం జరిగింది. ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరిం చాల్సిందిగా సంబందిత అధికారులకు పలు సూచనలు చేయడం అయినది. ఈ కార్యక్రమంలో వెల్దుర్తి గ్రామానికి చెందిన యమనగండ్ల వసంత చింతల ఆనంద్ గత కొంత కాలంగా ప్రేమించుకున్నారని తమ కులాలు వేరు కావటం వల్ల తమ పెళ్ళికి పెద్దలు ఒప్పుకోకపోవటంతో నాచారం గుట్ట వద్ద పెళ్లి చేసుకున్నామని ప్రస్తుతము తమకు తమ తల్లితండ్రుల వల్ల తమకు ప్రాణభయం ఉన్నదని కావున తమ తల్లితండ్రులను పిలిపించి న్యాయం చేయాలని ఫిర్యాదు చేయగా చట్టప్రకారం ఫిర్యాదికి తగిన న్యాయం వెల్దుర్తి యెస్.ఐ గారికి సూచనలు చేయటం జరిగింది. అలాగే హవేలిఘనాపూర్ మండలం ఔరంగాబాద్ గ్రామానికి చెందిన బుడ్డ యశోదకి ఔరంగాబాద్ గ్రామానికి చెందిన సిద్దిరాములు తో వివాహం అయిందని తమకు పిల్లలు పుట్టకపోవటంతో తన ఇష్టాపూర్వకంగా తన భర్తకి హవేలిఘనాపూర్ గ్రామానికి చెందిన నందాల సుజాతతో వివాహం చేశానని, పెళ్లి సమయంలో తమ స్థిర, చర ఆస్తులన్నీ ఇద్దరి భార్యలకు సరి సమానంగా పంచి ఇవ్వాలని పెద్దల సమక్షంలో నా భర్త రాతపోర్వకంగా రాసి ఇచ్చాడని, అయితే నా భర్త అనారోగ్య కారణం చేత మతిస్థిమితం సరిగా లేనందున మా ఆస్తులని నా భర్త రెండవ భార్య నందాల సుజాత ఆమె తమ్ముడు ఇద్దరు కలసి తనకి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అమ్మేస్తున్నారని కావున తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేయగా చట్టప్రకారం ఫిర్యాదికి తగిన న్యాయం చేయమని మెదక్ రూరల్ సి.ఐ. గారికి సూచనలు చేయటం జరిగింది. ఈ రోజు జిల్లా నలుమూలల నుండి పలు ఫిర్యాది దారులు రావడం జరిగినది.





# చలన చిత్రం




## 6న తెరపై జయమ్మ పంచాయితీ

బుల్లితెరపై తన సత్తాచాటి ఇప్పుడు వెండితెరపై తానేంటో యాంకర్ సుమ చూపించబోతోంది. ఆమె ప్రధాన పాత్రలో నటించిన చిత్రం జయమ్మ పంచాయితీ విజయ్ కుమార్ కలివరపు దర్శకత్వంలో తెరకెక్కింది. ఈ సినిమా మే 6 న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక రిలీజ్ డేట్ దగ్గరపడడంతో ప్రమోషన్స్ వేగవంతం చేసిన చిత్రబృందం వరుసగా ఇంటర్వ్యూలు ఇస్తూ వస్తున్నారు. ఇక ప్రతి ఇంటర్వ్యూలోనూ సుమ ఎదుర్కొంటున్న ప్రశ్న.. రాజీవ్ కనకాల తో విభేదాలు ఉన్నాయా..? మీరు ఇద్దరు విడాకులు తీసుకున్నారా..? అని .. గత కొన్నిరోజులుగా రాజీవ్, సుమ విడాకులు తీసుకున్నారని, వారిద్దరూ ప్రస్తుతం విడిగా ఉంటున్నారని వార్తలు గుప్పుమన్నాయి. ఈ వార్తలో నిజం లేకపోలేదు అని రాజీవ్ బహిరంగంగానే చెప్పాడు. నేను, సుమ కొన్ని రోజులు విడిగా ఉన్నామని, కొన్ని విభేదాలు మా మధ్య కూడా వచ్చాయని చెప్పుకొచ్చాడు. ఇక తాజాగా ఒక ఇంటర్వ్యూలో సుమ సైతం విడాకులపై స్పందించింది. రాజీవ్ ను నేను ప్రేమించి పెళ్లి చేసుకున్నాను. మాకు పెళ్ళై 23 ఏళ్లు అవుతుంది. ఈ 23 ఏళ్లు నేను ఎంతో సంతోషంగా ఉన్నాను. భార్యాభర్తలు అన్నాకా విభేదాలు రావడం సహజం. అదీకా కుండా ఇండస్ట్రీలో ఉన్నవారిపై ఇలాంటి పుకార్లు వస్తూ ఉంటాయి. అది అందరికి తెలిసిన విషయమే. ఇలా రూమర్స్ వచ్చినప్పుడల్లా నా ఫ్యామిలీ ఫోటోలను షేర్ చేస్తూ వాటికి చెక్ పెడుతూ ఉంటాను. కొంచెం బాధగానే ఉంటుంది.



## ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నా: కంగనా

సంచలన వ్యాఖ్యలతో పరిశ్రమలో ప్రకంపనలు రేపే బాలీవుడ్ క్వీన్ కంగనా రనౌత్ బోల్డ్ స్టేట్‌మెంట్స్ ఇవ్వడంలో ఎప్పుడూ ముందుంటుంది. తాజాగా కంగనా బాలీవుడ్ ఖాన్‌లపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. కెరీర్‌లో తాను ఎదుర్కొన్న ఒడిదుడుకులపై ఓ ఇంటర్వ్యూలో కంగనా వెల్లడిస్తూ తాను ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని ఇప్పుడున్న స్థితికి చేరుకున్నానని తెలిపింది. ఖాన్‌ల సినిమాల నుంచి కుమార్‌ల ప్రోద్బలంతో తీసే సినిమాలను తాను తిరస్కరించడంతో గడ్డు పరిస్థితిని ఎదుర్కొన్నానని చెప్పింది. బాలీవుడ్‌లో పురుషాధిక్య సినిమాలను తిరస్కరించి దీటుగా ఎదిగేవరకూ ఎన్నో ఎత్తుపల్లాలను చూశానని తెలిపింది. తాను ఇది ప్లాన్‌తో చేసింది కాదని, రజనీష్ ఘయ్, దీపక్ ముకుత్, సోహెల్ మ్లుకై వంటి ఎందరో నిర్మాతలు, పురుషుల మద్దతుతో తన ప్రస్థానం ఇక్కడ వరకూ సాగిందని వ్యాఖ్యానించింది. మహిళ విజయం వెనుక పురుషుడి సహకారం ఉంటుందని మగువల విజయం ఎన్నో అంశాలతో ముడిపడిఉన్నదని బాలీవుడ్ క్వీన్ కంగనా రనౌత్ అన్నారు.

## పుష్పతో పెరిగిన బన్నీ రెమ్యూనరేషన్



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్.. ఇటీవల 'పుష్ప ది రైజ్' చిత్రంతో బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ అందుకోవడమే కాదు... ఈ సినిమాతో బన్నీ జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు గడించాడు. విడుదలైన అన్ని భాషల్లోనూ, ఓవర్సీస్ లోనూ కలెక్షన్స్ మోత మోగించింది. ముఖ్యంగా బాలీవుడ్‌లో రికార్డు స్థాయిలో వసూళ్లు రాబట్టింది. ఈ నేపథ్యంలో ఈ సినిమా రెండో భాగమైన 'పుష్ప ది రూల్' పై భారీ అంచనాలు నెలకొన్నాయి. జూలైలో రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుంది. ఆ లోపు స్క్రిప్ట్‌లో దర్శకుడు సుకుమార్ భారీ మార్పులు చేస్తున్నారు. అలాగే రెండో భాగంలో రెండు, మూడు కొత్త పాత్రల్ని ప్రవేశపెడుతున్నారు. ఇక మొదటి భాగం తెచ్చిపెట్టిన సూపర్ క్రేజ్ వల్ల బన్నీ 'పుష్ప ది రూల్' చిత్రం కోసం తన పారితోషికాన్ని రెట్టింపు చేశాడనే వార్తలొస్తున్నాయి. పుష్ప మొదటి భాగం కోసం అల్లు అర్జున్ ఏకంగా రూ. 50 కోట్లు పారితోషికం అందుకున్నాడని సమాచారం. తాజా సమాచారం ప్రకారం 'పుష్ప ది రూల్' కోసం బన్నీ రూ. 100 కోట్లు పారితోషికం అందుకోబోతున్నాడని టాక్స్ వినిపిస్తున్నాయి. మైత్రీ వారు బన్నీ కోరిన విధంగానే అంత ఎక్కువ మొత్తం పారితోషికం ఇవ్వడానికి అంగీకరించారట. తన కెరీర్‌లోనే మొట్ట మొదటి పాన్ ఇండియా చిత్రంతో బిగ్గెస్ట్ హిట్ అందుకోవడమే కాకుండా.. అత్యధిక మొత్తాన్ని పారితోషికంగా అందుకోవడం.. రెండో భాగానికి రెట్టింపు డిమాండ్ చేయడం అల్లు అర్జున్ కు మాత్రమే చెల్లింది. రెండో భాగం కూడా బ్లాక్ బస్టర్ హిట్ అయితే .. తదుపరి చిత్రం కోసం అతడు మరింతగా తన డిమాండ్ పెంచే అవకావం లేకపోలేదు.




## 9నఎఫ్-3 ట్రైలర్ విడుదల

విక్టరీ వెంకటేశ్, మెగా ప్రిన్స్ వరుణ్‌తేజ్ హీరోలుగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన కామెడీ ఎంటర్ టైనర్ 'ఎఫ్ 3' త్వరలోనే తెరపైకి రానుంది. ఇది గతంలో వచ్చిన సూపర్ హిట్ చిత్రం 'ఎఫ్ 2' కు ఇది సీక్వెల్ అన్న సంగతి తెలిసిందే. దిల్ రాజు నిర్మాణంలో రూపొందుతోన్న ఈ సినిమా.. మొదటి భాగంలోని పాత్రలతోనే .. వేరే కథతో రూపొందుతోంది. డబ్బు చుట్టూ తిరిగే కథతో ఈ భాగం నవ్వులు పూయించనుంది. తమన్నా, మెహ్రీన్ కథానాయికలుగా కంటిన్యూ అవుతుండగా.. సునీల్ పాత్ర అదనంగా చేరుతోంది. మొదటి భాగాన్ని మించిన స్థాయిలో ఇందులోని కామెడీని వర్కవుట్ చేశాడట దర్శకుడు. ఇటీవలే టాకీ పార్ట్ ను పూర్తి చేసుకున్న ఈ సినిమాను ఈ నెల 27న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్స్‌లో విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో 'ఎఫ్ 3' ట్రైలర్ ను ఈ నెల 9న విడుదల చేస్తున్నట్టు ట్విట్టర్ వేదికగా ప్రకటించారు. 'సమ్మర్ సోగ్గాళ్లు' అనే ట్యాగ్ లైన్ తో ఔట్ అండ్ ఔట్ కామెడీ ఎంటర్ టైనర్‌గా రూపొందుతోన్న ఈ సినిమా వెంకీ, వరుణ్ ఖాతాలో ష్యూర్ షాట్ హిట్‌గా నమోదవుతుందని చెబుతున్నారు. ఇక ఈ సినిమాలో బుట్టబొమ్మ పూజా హెగ్డే ఓ ప్రత్యేకగీతంలో నర్తిస్తోంది. త్వరలోనే ఈ పాట లిరికల్ సాంగ్ ను విడుదల చేయబోతున్నారు. దేవీశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఎఫ్ 3 చిత్రం ఏ స్థాయి సక్సెస్ ను సొంతం చేసుకుంటుందో చూడాలి.

## సర్కారు వారిపాట కోసం అభిమానుల ఎదురుచూపు

### 12న విడుదలకు సిద్ధంగా మహేశ్ చిత్రం




సూపర్‌స్టార్ మహేశ్ బాబు, పరశురామ్ కలయికలో తెరకెక్కుతోన్న యాక్షన్ థ్రిల్లర్ 'సర్కారువారి పాటకోసం మహేశ్ ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇండియాలో జరిగిన అతి పెద్ద బ్యాకింగ్ స్కామ్ నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కింది. ఈ నెల 12న ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమా థియేటర్స్‌లో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్రానికి సంబంధించిన ప్రమోషన్స్‌ను స్పీడప్ చేశారు మేకర్స్. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టీజర్, సింగిల్స్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. త్వరలో ట్రైలర్ కూడా విడుదల కాబోతోంది. 'సరిలేరు నీకెవ్వరు' బ్లాక్ బస్టర్ తర్వాత మహేశ్ బాబు, 'గీతగోవిందం' సూపర్ హిట్ తర్వాత పరశురామ్ కలయికలో రానున్న సినిమా కావడంతో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక ఇందులో కథానాయికగా నటిస్తున్న కీర్తి సురేశ్ తన పాత్రకి డబ్బింగ్ పూర్తి చేసింది. ఈ విషయాన్ని ట్విట్టర్ వేదికగా ప్రకటించారు. దర్శకుడు పరశురామ్, కీర్తి సురేశ్, తమన్ దిగిన ఫోటోను ఈ సందర్భంగా షేర్ చేశారు. 'మహానటి' చిత్రం నుంచి తన పాత్రకి తనే డబ్బింగ్ చెప్పుకోవడం మొదలు పెట్టింది కీర్తి సురేశ్. అందులో అత్యంత సహజంగా తన వాయిస్‌ను వినిపించిన కీర్తి.. 'సర్కారువారి పాట' చిత్రంలో కూడా అంతే అందంగా తన గొంతును వినిపించబోతోంది. మహేశ్ బాబుతో తొలిసారిగా రొమాన్స్ చేస్తున్న కీర్తి సురేశ్ ఈ సినిమాతో ఏ స్థాయిలో సక్సెస్ అందుకుంటుందో చూడాలి.



## రాధికతో మరోమారు చిరు చెట్టాపట్టాల్

రీసెంట్‌గా 'ఆచార్య'గా ప్రేక్షకుల ముందుకొచ్చిన చిరంజీవి క్రేజీ లైనప్‌తో యంగ్ హీరోలకు పోటీనిస్తూ దూసుకెళ్తున్నారు. ఇప్పటికే ఐదారు చిత్రాలతో బిజీగా ఉన్న మెగాస్టార్ మరో ఇంటరెస్టింగ్ ప్రాజెక్టుని ఓకే చేశారు. ఎయిటీస్, నైంటీస్‌లో అనేక సినిమాల్లో జంటగా నటించి మెప్పించిన చిరంజీవి, రాధిక కాంబినేషన్ మరోసారి రిపీట్ కానుంది. అయితే దీనికి రాధిక శరత్‌కుమార్ నిర్మాతగా వ్యవహరించ నున్నారు. ఈ విషయాన్ని రాధిక నిన్న అఫీషియల్‌గా అనౌన్స్ చేశారు. తమ బ్యానర్ రాడాన్ కోసం ఓ ప్రాజెక్ట్ చేయడానికి ఒప్పుకున్నందుకు చిరంజీవికి థ్యాంక్స్ చెబుతూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. కింగ్ ఆఫ్ మాస్‌తో బ్లాక్ బస్టర్ తీసేందుకు చాలా ఎక్సైటింగ్‌గా వెయిట్ చేస్తున్నానని ట్వీట్ చేశారామె. రాడాన్ ప్రొడక్షన్ బ్యానర్‌లో తమిళంలో పలు సీరియళ్లు, సినిమాలు, వెబ్ సిరీసులు నిర్మించారు రాధిక. త్వరలోనే తెలుగులో ఓ భారీ సినిమాని తెరకెక్కించాలని ఎ÷-లాన్ చేసుకున్నారట. ఆ సినిమా చిరంజీవితోనే తీయాలనేది ఆమె కోరిక అని, ఇది కచ్చితంగా క్రేజీ కాంబో అవుతుందంటున్నాయి కోలీవుడ్ వర్గాలు. ఇదిలా ఉంటే చిరంజీవి ప్రస్తుతం మోహన్ రాజా దర్శకత్వంలో 'గాడ్ ఫాదర్', మెహర్ రమేష్‌తో 'భోళా శంకర్' సినిమాల్లో నటిస్తున్నారు. వీటితో పాటు బాబీ, వెంకీ కుడుముల డైరెక్షన్‌లోనూ చిరుకి కమిట్‌మెంట్స్ ఉన్నాయి. మరి ఇవన్నీ కంప్లీట్ అయ్యాకే రాధికతో ప్రాజెక్టు స్టార్ట్ చేస్తారా, వీటికంటే ముందే మొదలుపెడతారో చూడాలి.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **GPR PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
TITLE CODE.TELTEL02057, Cell:8464816456 Email: aksharavelugudaily@gmail.com, Website: www.aksharavelugu.com